
# సంపాదకీయ వ్యాసంగం



## శ్రీ రుక్మిణీనాథ శాస్త్రి

తొమ్మిదిన్నర కొట్టింది. రాత్రి మూడేసి దాకా చలపతితో బాతాఖానీ కొడుతూ మేలుకున్నాను. రాకరాక వొచ్చావని రైలు దిగీదిగటంతోనే కలుసుకుని యింటికి తీసుకెళ్లి కబుర్లతో హూనంహూనం చేశాడు. గోష్ఠి, అవిచ్ఛిన్నంగా జరిగింది. చలపతి నిద్దరన్న మాటే మరిచిపోయాడు. మూడుం బావుకు పడుకున్నామేమో... ఎనిమిందిం బావు దాకా నాకు మెళుకువ రాలేదు. చలపతి యింకా లేవనే లేదు. అనుష్ఠానాలన్నీ తీర్చుకుని చలపతిని లేపాను. లేచి వొళ్లు విరుచుకుని, తాపీగా యింకో గంటైనా అధమం నిద్ర పోవాల్సిందే! అని చలపతిరావు, మళ్లీ కుంభకర్ణుడితో నేస్తం కలిపాడు. సరే— నేను కూడా హోటలుకు పోయి వద్దామని బయలు దేరాను. దారిలో యిద్దరు ముగ్గురు స్నేహితుల్ని చిరునవ్వుతో తప్పించుకుని హోటల్ కు చేరుకునే సరికి— మనవాడు రామారావు ప్రత్యక్షమైనాడు. ‘ ఏమోయ్! రామారావ్!’ ‘ అంటిని! ’ ‘ ఓహో! శాస్త్రి! వెల్ కం! రా పోదాం ’ అన్నాడు.

ఇద్దరం హూటల్ లోకి వెళ్లాము. తినుబండారాలకు ఆర్డరిచ్చి రామారావు ప్రస్తుత పరిస్థితులు మాట్లాడుతూన్నాడు.

“ ఎవరైనా కవిమిత్రులున్నారా ఘ్రాల్లో ?”

"శివశంకరశాస్త్రి గారు నిన్ననే కంతేరు వెళ్లారు!"

"అగే! లేగే! కాస్సేపు గోష్ఠికి!"

"ఆముదం చెట్టు..లాగు నేనే కవి మిత్రుణ్ణి!"

"అచ్ఛా!"

"బ్లాల అచ్చు యెప్పుడు 'మొదలెడ తారోయ్!"

"ముద్దుకృష్ణ వొచ్చాక ప్రారంభిస్తా డను కుంటా!"

"నువ్వేం చేస్తున్నావూ?"

"నీతో పాటు బాతాఖానీ వేస్తున్నాగా!"

"అది సరేలే!- యేమి వ్యాపారం సాగించ సంకల్పించావన్న మాట?"

"పత్రిక రణ్ణ చేద్దామను కుంటున్నా!"

"ంహుఁ"

"....................."

"ఎప్పుడు ప్రారంభం చేస్తావ్!"

"ఇదుగో నెలాఖర్ను"

"ఎడ్వర్టైజ్‌మెంట్లు సంపాయించావా?"

"ఓ!"

"కథలు!"

"అవే తక్కువగా వున్నాయి. మునిమాణిక్యానికి రాశాను!"

"యే మన్నాడూ"

"జబాబు లేదు"

"శిరోమణితో సంప్రతించావా?"

"బుర్రఆడించి... యేదేశంలో వున్నాడో తెలియ లేదు"

"పోనీ గుంటూరు వెళ్లి కనుక్కోక పోయినావా?

"ఇవాళే గుంటూరు పోతున్నాను"

"వెంకటచలం!"

"అబ్బ. వొగ్గోయి మనకా కథలు!"

"యేం!"

"మనం తట్టుకో లేము!"

"సరే"

"బాపిరాజును బొమ్మ గీయమని రాశానుగా!"

"శుభం!"

"శివశంకర శాస్త్రుర్లు గారు వ్రాస్తారా?"

"ఎందుకు వ్రాయరూ?"

"కవికొండల వారు!"

"అప్పుడే పద్యాలకట్టలు పంపించారోయ్!"

"యింకా!"

"బొడ్డు బాపిరాజు పద్యాలు పంపించాడు!"

"ఉఁహూఁ!"

"అడివి బాపిరాజుకి మళ్లీ రాయి; కథలూ పద్యాలూ, కూడా పంపమని!"

"ఆలోటేమీ చేయ లేదు!"

"యిదుగో వొక్క మాట చెప్తున్నా వినూ. ఆ! జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి గారితో కూడా కాస్త మంచిమాట చేసుకో! నీకు పుష్కలంగా... మాటరు దొరుకుతుంది!"

"....................."

"చూడూ- విలువ వున్న మాటరు దొరుకుతుందోయ్!"

"అల్లాగే రాస్తాను!"

౨

సాయంత్రం నాలుగున్నరకు రామారావు చలపతి యింటి వాకిట్లోంచి పిలిచాడు. 'గుంటూరుపోలేదా' అంటే పో లేదన్నాడు. షికారుకు వెళదామని మొండిపట్టు పట్టాడు. ఏమిటోయ్! యిప్పుడు షికారా! అంటే___ కాదు కూడదని బయలుదేర తీశాడు. కాఫీ దేవి...నమస్తుభ్యం! అని కాఫీ ప్రార్ధన చేశాక అవునోయ్ శాస్త్రి అప్పుడు నువ్వు రాశావు చూడూ___వెంటనే అందుకుని, 'అది యిక్కడ లేదోయ్! బందరులో వుందన్నాను. పోనీలే! యిప్పుడు మళ్లీ రాయరాదూ? అన్నాడు. కథం ఘటతే నాయనా? అని అన్నాను వింటేగా? హుషార్ సామగ్రీ సమర్పించుకొంటానన్నాడు. ఆః! ఎందుకోయ్ బందరు పోయి పంపిస్తాలే! అని కాస్సేపు ఉండి సర్దుకున్నాను.

"శాస్త్రి!"

"..................."

"బందరు వెళ్టంతోనే మునిమాణిక్యాన్ని కాస్త మనకు సుముఖుణ్ణి చేసి కథ పంపమను"

"అలాగే!"

"చూడూ- శాస్త్రిగారితో కూడా... చెప్పు. కథ కావాలన్నానని"

"సరేలే!"

"మరిచిపోకు- నువ్వు కూడా- ఓకథా ఓ ఛందశ్చర్చా- పంపు"

"చిత్తం"

"నీ దగ్గర సామెతల పుస్తకం ఉందా?"

"అంటే?"

"నువ్వు కలెక్టు చేశింది"

"వుండాలి"

"అది కూడా పంపు. ప్రతి నెలా కొన్ని చొప్పున వేస్తాను"

"సరేలే___"

"ప్రబుద్ధాంధ్ర హిందీ మీద విరుచుకు పడ్డదోయ్! మనం ప్రబుద్ధాంధ్రకు ప్రతిగా పని చేయాలి!"

"అదోటి కూడానా?"

"అవును యీ హిందీ- మన్ని వుద్ధరించే భాష!"

"ఉఁహూఁ!"

"సరే గాని యింటికి పోదాములే!"

ఈ మాటలు చెప్పటానికేటోయ్! నన్ను యిక్కడకు లాక్కొస్త?"

"భలే వాడివోయ్! శాస్త్రి!"

3

ఇంటికి వొచ్చేశాను. బందరు వొచ్చేశిన రెండుమూడు రోజులకు రామారావు దగ్గర నుంచి ఉత్తరం వొచ్చింది- మామూలు మాటకు నేను పాటి చెయ్య లేదు. మావాడు బాహాటంగా- మాడరన్ రెవ్యూ దర్జాతో- పత్రిక నడుస్తుందని ఎడ్వర్టైజ్‌మెంటు చేస్తున్నాడు పత్రికల్లో- రణ్గొల్లయింది. మా బాబాయి రమ్మంటే- బెజవాడ వెళ్లి- మధ్యాన్నం రామారావు యింటికి వెళ్లాను.

'ఓ! సమయానికీ చక్కా వొచ్చా'వంటూ తలుపు తీశాడు. మామూలు మర్యాదలూ,

లాంఛనాలూ అయిం తరువాత- కారం రాచిన కందిపప్పూ, అప్పడాలపిండీ- పకోడీలూ ముందు పెట్టి తాను కందిపప్పు కరకరా నములూ బాతా ఖానీ కొడ్తున్నాడు. ఏమిటిరా అబ్బీ! యీ రభస అంటే యివాళ ఎడిటోరియల్ రాయాలోయ్! అన్నాడు. మిగిలిన ఫారాలు ప్రింటయినవా అంటే- యీ ఫారం ముందు ప్రింట్ చేయిస్తున్నాను. కథలూ అవీ యింకా రాలేదు, అన్నాడు.

బాపిరాజు బొమ్మ వేయలేదా అంటే- లేదన్నాడు మరి పద్యాలు వొచ్చాయన్నావు కదా అంటే- అవేవీ యింకా రాలేదు వొస్తాయి- రేపో- యెల్లుండో- అన్నాడు.మరి అప్పుడల్లా చెప్పావేమంటే- అల్లాగే చెప్పాలి- నీకు తెలియదన్నాడు.

జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి గారికి రాశావా అంటే- యింకా రాయలేదు రేపో యెల్లుండో- రాస్తానన్నాడు. అంటూనే- యింట్లోకి పోయి- కాఫీ- రెండు వెండిగిన్నెలతో తెచ్చాడు. చవిచూద్దును గదా- ఫ్లేవర్- లేదు సరేగదా- మిరియాల కషాయంలా వుంది. తప్పని సరిగా తాగాను. యింకా విశేషాలేమిటిరా అంటే

యిల్లు అద్దెకు తీసుకున్నాను. అచ్చాఫీసు ఓటి కొంటున్నాను. ఇక నుంచీ రెగ్యులర్ గా పత్రికను నడుపుతాను అన్నాడు.

డబ్బు యెక్కడిది రా? అంటే యెవరో జమీందార్ ఫ్రెండ్ యిస్తాడు లే! అన్నాడు. యిస్తాడా ? నువ్వు అనుకుంటున్నావా అంటే- యిస్తే యిస్తాడు. లేకపోతే - పొలం అమ్మైనా కొంటాను. షూర్ ! అని చేతిలో చెయ్యి వేశాడు. అంతా విని విని- చెడిపోతావు రా అబ్బీ! అన్నాను.

“ ప్చ్ !”

అని నా వంక పరమహంసి చూపులు చూశాడు.

యిప్పటికీ పత్రిక- రానే లేదు. మొన్న కనిపించి- ఏంరా! అబ్బీ!

అంటే ?

“ కష్టాలు వొచ్చినా... కాలకుతరిమినా కన్నీళ్లు రాల్చకే- కలుష మెరుగని చెలీ!” అని- దూసుకు చక్కా- పోయాడు.

---


# జె. ఓ. ఫోన్సు



నిర్మాణమునకు, నాణ్యతకు పేరెన్నిక గన్న అద్భుతమైన కొలారో మోటారుతో నమర్చబడిన మిషను. దీనిలోని సామాను లన్నియు ఇంగ్లాండులో చేయబడినవి. అయిదు సంవత్సరములు గ్యారంటి. విడి భాగములుగూడ విక్రయించబడును.

ప్రతి చోటను ఏజంట్లు కావలయును.

## జె. ఓ. ఫోన్ కంపెని,

2/15 లక్ష్ముదాసు వీధి పి. టి. మద్రాసు